క్లుప్తంగా

బెల్టు షాప్‌పై దాడి: కేసు నమోదు

అమరచింత: మండల పరిధిలోని మిట్టనంది మళ్లలో రాంరెడ్డి అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించి 9.8 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరుపరాదన్నారు. కొన్ని నెలలుగా రాంరెడ్డి గ్రామంలో బెల్టు షాప్ నిర్వహిస్తూ.. మద్యం అమ్ముతున్నాడని తెలిపారు. రాంరెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం



ఆత్మకూర్: యావత్తు దేశ ప్రజలందరూ కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని టీపీసీసీ అధికారప్రతినిధి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశాభివృద్ధిని విస్మరించి దేశం కోసం ధర్మం కోసం అంటు అధికారంలోకి వచ్చిన బీజేపీ మతరాజకీయాలు చేస్తూ విధ్వంసాలకు పాల్పడిన వారికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. చల్లాకు అత్యధిక మెజార్టీ నిచ్చి సీఎం రేవంత్‌రెడ్డికి గిఫ్టుగా ఇవ్వబోతున్నామని, ఇందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసిరాజ్, నల్గొండశ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 1వ వార్డులో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశ భవిష్యత్ మారాలంటే రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే సాధ్యమవుతుందని ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేసేందుకు చిత్తశుద్ధితో ఉందన్నారు. ప్రచారంలో ఎన్‌జె.బోయేజ్, పి.కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పిజె.బాబు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, మిషేక్ తదితరులు ఉన్నారు.

దేశ ప్రజల సంక్షేమమే బీజేపీ లక్ష్యం



కొత్తకోట రూరల్: దేశ ప్రజల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని ముమ్మళ్లపల్లి, సంకిరెడ్డిపల్లితండాలో ఆయన పర్యటించి మాట్లాడారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఐదు కిలోల బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. దేశంలోని ప్రతి రైతుకు ఏడాదికి రూ.6 వేలు పెట్టుబడి సాయంతో పాటు రాయితీపై ఎరువులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. మోదీని మూడోసారి ప్రధానిని చేసేందుకు ప్రతి ఒక్కరూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు దాబా శ్రీనివాస్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆయా గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి రాష్ట్ర కబడ్డీ విజేత పాలమూరు

అమరచింత: నందిమళ్లలో చింతల మునిరంగ స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన ఉమ్మడి రాష్ట్రాల కబడ్డీ విజేతగా మొదటి బహుమతిని మహబూబ్‌నగర్ జట్టు గెలిచి రూ.40 వేల నగదు బహుమతిని కైవసం చేసుకుంది. కబడ్డీ పోటీలను మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడలు క్రీడాకారులతో పాటు ప్రజల్లో సోదర భావంను కలిగిస్తాయన్నారు. కబడ్డీ పోటీల్లో మొత్తం పది జట్లు పాల్గొనగా.. మొదటి బహుమతిని పాలమూర్ జట్టు సాధించింది. రెండో బహుమతిని ఆత్మకూర్ మండలం మూలమళ్ల గ్రామ జట్టు సాధించి రూ.30 వేల నగదుతో పాటు షీల్డ్ కైవసం చేసుకుంది. మూడో బహుమతిగా రూ.20 వేలు, నాలుగో బహుమతిగా రూ.10 వేల నగదును మహబూబ్‌నగర్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్, కేశం నాగరాజ్‌గౌడ్ చేతుల మీదుగా అందించారు.



ఉన్నత చదువులకు దూరం

- కలగా మారిన ఖిల్లాఘనపురం డిగ్రీ కళాశాల ఏర్పాటు
- సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మండల ప్రజలు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు



ఖిల్లాఘనపురంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అధికారులు గుర్తించిన ప్రభుత్వ స్థలం

ఖిల్లాఘనపురం: పల్లెల్లో కాయకష్టం చేసుకుని జీవించే కుటుంబాల్లో జన్మించిన నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఉన్న గ్రామాలు, మండల కేంద్రం వరకు ఎలాగో వెళ్లి ఇంటర్ వరకు చదివినా.. ఆపై చదువులు చదవాలంటే పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. ఖిల్లాఘనపురం మండలానికి మూడు వైపులా ఉన్న మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ పట్టణాల్లో ఎటు వెళ్లాలన్నా 25 నుంచి 30 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. అసలే పేదరికం.. అంత దూరం వెళ్లలేని వారు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ఏళ్లతరబడి నేతలు హామీలు ఇస్తూ..నే ఉన్నారు. కళాశాలకు కావాల్సిన భూమిని గుర్తించినట్లు చెబుతున్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా.. ఏ నాయకుడు డిగ్రీ కళాశాల ఏర్పాటు గురించి శ్రద్ధ తీసుకోవడం లేదు. నేటికీ కళాశాల మంజూరు కాకపోవడంతో మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మూడు జిల్లాలకు మధ్యన...

ఖిల్లాఘనపురం మండలం వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు మధ్యస్తంగా ఉంది. ఈ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడంతో మూడు జిల్లాలకు చెందిన ఖిల్లాఘనపురం, పెద్దమందడి, భూత్పూర్, బిజినేపల్లి, మూసాపేట తదితర మండలాలకు చెందిన చాలా గ్రామాలు, గిరిజన తండాలకు చెందిన వందల మంది విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది. ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు పట్టణాలకు వెళ్లలేని పరిస్థితిలో ఉండటంతో ఉన్నత చదువులకు దూరమై మధ్యలోనే చదువులు మాని పనులు చేసుకునేందుకు హైదరాబాద్‌కు వలస వెళ్తున్నారు. ఆడపిల్లల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉంది. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని సుమారు 8 సంవత్సరాల కిందట కొందరు అధికారులు వచ్చి ఇంటర్ కళాశాలను పరిశీలించారు. నూతన భవనాలు నిర్మాణం జరిగే వరకు ఇంటర్ కళాశాలలోనే తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల నిర్మాణానికి పోలీస్‌స్టేషన్ వెనుకాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు చెప్పారు. కాని ఇప్పటికీ ఎలాంటి పనులు జరగలేదు. ప్రతి 5 సంవత్సరాలకు ఒక సారి ఎన్నికల సమయంలో మాత్రం ప్రజాప్రతినిధులు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తూనే ఉన్నారు.



డిగ్రీ కళాశాలను తాత్కాలికంగా నిర్వహించేందుకు అధికారులు పరిశీలించిన జూనియర్ కళాశాల

వందల మంది విద్యార్థులు...

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 105, తెలంగాణ మాడల్ కళాశాలలో 201 మంది మొత్తం 306 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. వీరు ఇంటర్ పూర్తి కాగానే పట్టణాలకు వెళ్లి చదవలేని పరిస్థితుల్లో చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఆడపిల్లలకు ఇంటి పనులు అప్పజెప్పడంతో పాటు వీలైనంత త్వరగా పెళ్లిళ్లు చేసి పంపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవతీసుకుని మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి..



ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఉంటే నాలాంటి నిరుపేద కుటుంబాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి.

– మౌనిక, తెలంగాణ మాడల్ కళాశాల ఖిల్లాఘనపురం

ఎన్నికల హామీగానే..



మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రతి సారి ఎన్నికల ప్రచారంలో నాయకులు హామీలు ఇస్తున్నారు. ఎన్నికల పూర్తి కాగానే పక్కకు పెడుతున్నారు. కేవలం నాయకులకు ఎన్నికల సమయంలో ఇచ్చే హామీగానే మిగిలిపోయింది. హామీలు ఇవ్వడం కాదు పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే ప్రేమ ఉంటే కనీసం ఇప్పుడైనా.. ప్రజాప్రతినిధులు కృషిచేయాలి.

– దాసర్ల భూమయ్య, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు, ఖిల్లాఘనపురం

సత్తాచాటిన గురుకులాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని గురుకుల కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఇందులో ఎస్సీ గురుకుల కళాశాలలకు సంబంధించి మొదటి సంవత్సరంలో జిల్లాల వారీగా గద్వాలలో 72.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. వనపర్తిలో 72.21, నాగర్‌కర్నూల్‌లో 73.4, మహబూబ్‌నగర్‌లో 80.89 శాతం, నారాయణపేటలో 77.92 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రెండో సంవత్సరంలో వనపర్తి 83.28 శాతం, నాగర్‌కర్నూల్ 81 శాతం, మహబూబ్‌నగర్ 91 శాతం, గద్వాల 76.1, నారాయణపేట 82.3 శాతం నమోదైంది.

- ఎస్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 71.43 శాతం, వపపర్తి 95.38, మహబూబ్‌నగర్ 73.02, నాగర్‌కర్నూల్ 72.09, నారాయణపేట 71.63 శాతం సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో గద్వాల 84.21, వనపర్తి 94.67, నాగర్‌కర్నూల్ 85.85, మహబూబ్‌నగర్ 83.33, నారాయణపేట 91.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- టీఎస్ఆర్‌జేసీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 89.33, మహబూబ్‌నగర్ 97.53, రెండో సంవత్సరంలో గద్వాల 92.65, మహబూబ్‌నగర్ 98.8 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్‌లో కళాశాలలు లేవు.
- మోడల్ స్కూళ్లలో మొదటి సంవత్సరం వనపర్తిలో 50.17, నాగర్‌కర్నూల్‌లో 38.07, మహబూబ్‌నగర్‌లో 50, నారాయణపేటలో 47.2 శాతం ఉంది. రెండో సంవత్సరంలో వనపర్తిలో 69.6, నాగర్‌కర్నూల్‌లో 55.34, మహబూబ్‌నగర్‌లో 69.6, నారాయణపేటలో 46.86 శాతం ఉత్తీర్ణత సాధించగా గద్వాలలో కళాశాల లేదు.
- కేజీబీవీల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 73.84, వనపర్తిలో 74.2, నాగర్‌కర్నూల్‌లో 63.77, మహబూబ్‌నగర్‌లో 76.45, నారాయణపేటలో 72.59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరంలో గద్వాలలో 83.9, వనపర్తి 83.3, నాగర్‌కర్నూల్ 75.58, మహబూబ్‌నగర్‌లో 85.84, నారాయణపేటలో 76.29 శాతం ఉత్తీర్ణత వచ్చింది.
- మైనార్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 83.87, వనపర్తిలో 73.21, నాగర్‌కర్నూల్‌లో 60.32, మహబూబ్‌నగర్‌లో 73.57, నారాయణపేటలో 75 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. రెండో సంవత్సరంలో గద్వాల 88.7, వనపర్తిలో 82.86, నాగర్‌కర్నూల్‌లో 85.25, మహబూబ్‌నగర్‌లో 86.6, నారాయణపేటలో 87.78 శాతం ఉత్తీర్ణత వచ్చింది.
- ప్రభుత్వ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 47.65 శాతం, వనపర్తిలో 35.68, నాగర్‌కర్నూల్‌లో 34.35, మహబూబ్‌నగర్‌లో 42.08, నారాయణపేటలో అత్యల్పంగా 29.61 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక రెండో సంవత్సరంలో గద్వాల 59.96, వనపర్తి 51.4, నాగర్‌కర్నూల్‌లో 49.8, మహబూబ్‌నగర్‌లో 50.94, నారాయణపేట 41.23 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.
- బీసీ గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో గద్వాల 88.35 శాతం, వనపర్తి 77.6, నాగర్‌కర్నూల్ 74.73, మహబూబ్‌నగర్ 72.44, నారాయణపేట 64.41 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రెండో సంవత్సరంలో గద్వాలలో 93.44, వనపర్తిలో 84.97, నాగర్‌కర్నూల్‌లో 88.39, మహబూబ్‌నగర్‌లో 91.8, నారాయణపేటలో అత్యధికంగా 96 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

పోచమ్మ ఆలయానికి శంకుస్థాపన

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో ఆదివారం పోచమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాగరాల గ్రామం రంగసముద్రం రిజర్వాయర్ మునిగిపోవడంతో నూతనంగా ఏర్పడిన నాగరాల పస్ట్ సెంటర్‌లో పోశమ్మ ఆలయం లేకపోవడంతో గ్రామపెద్దల నిర్ణయం మేరకు నూతన ఆలయానికి దాతల సహకారంతో నిర్మించేందుకు శంకుస్థాపన చేశామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న గ్రామస్తులు

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

అమరచింత: నిత్యం ఆన్‌లైన్ మోసాలు అధికమవుతూ అమాయక ప్రజలు మోసపోతున్నారని ఆన్‌లైన్ మోసాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సురేష్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ప్రధాన రహదారిపై ప్రజలకు ఆన్‌లైన్ మోసాలు, క్రికెట్ బెట్టింగ్‌లు, లోన్‌యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. వేసవి సెలవుల్లో తమ ఇంట్లో చిన్నారులు బావులు, చెరువుల్లో ఈత కోసం వెళ్తుంటారని వారి వెంట కుటుంబ సభ్యులు వెళ్లాలని సూచించారు. ఈత కోసం చిన్నారులను ఒంటరిగా పంపడం ద్వార ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. సరదాగా సాగే ఈత తమ కుటుంబంలో విషాదం నింపకూడదన్నారు. పదో తరగతి, ఏడో తరగతి చదువుతున్న మైనర్‌లకు బైక్‌లు ఇవ్వడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, అలాంటి వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మండుతున్న ఎండల కారణంగా ప్రజలు ఉదయం పదకొండు గంటల వరకే బయట ఉండాలని, అవసరం అయితే తప్పా.. బయటకు రాకూడదన్నారు. వడగాల్పుల కారణంగా ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదాలు ఉన్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్‌ల పంపిణీ

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. వీపనగండ్ల, సంగినేనిపల్లి, తూముకుంట, రంగవరం తదితర గ్రామాల్లోని బూత్‌లెవల్ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ స్లిప్‌లను ఓటర్లకు అందజేశారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు సుగుణాబాయ్, సువర్ణ, చంద్రకళ, పారిజాత, వెంకటేశ్వరమ్మ, భారతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి పంపులు ప్రారంభిస్తున్న నాయకులు

వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్లలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలతో వేసిన బోర్‌లకు ఆదివారం మోటార్ల బిగించి, నీటి పంపులను ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నీటి పంపుల ప్రారంభంతో గ్రామంలోని పలు కాలనీలకు తాగునీటి వసతి మెరుగవుతుంది. పంపుల ఏర్పాటుకు సహకరించిన మంత్రికి మండల వైస్ ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, రఘునాథ్‌రెడ్డి, నరేష్, మల్లేష్, వెంకటేశ్వర్లు, మల్లయ్య, శ్రీనివాసులు, ఆంజనేయులు, బాలస్వామి, కురుమయ్యలు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థినులకు సన్మానం



చీర్ల జాగృతి, మేఘనలను సన్మానిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: పరీక్షలు రాసి ఫలితాల్లో పాసైన, కాకపోయిన, అధిక ఉత్తీర్ణత రాకపోయిన విద్యార్థులు ఎలాంటి ఘటనలకు పాల్పడకూడదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 9వ వార్డు మర్రికుంటకు చెందిన చీర్ల జాగృతి, చీర్ల మేఘనలు ఇంటర్‌లో అధిక మార్కులు సాధించడంతో వారిని ఈ మేరకు శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో సెకండ్ ఇయర్‌లో 980/1000 సాధించిన చీర్ల జాగృతి, ఫస్ట్ ఇయర్‌లో 440/433 మార్కులను చీర్ల మేఘన సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో పట్టువదలకుండా కృషితో ఉన్నతంగా ఎదగాలని, ఎవరు ఎంచుకున్న లక్ష్యాలను వారు చేరుకొని తల్లిదండ్రులకు పేరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.కృష్ణ, పట్టణ మాజీ అధ్యక్షుడు కిరణ్ కుమార్, నాయకులు చీర్ల జనార్దన్, నందిమల్ల యాదయ్య, దివాకర్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

అమరచింత: పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పురం లింగారెడ్డి తల్లి బాలకిష్టమ్మ(85) అనారోగ్యంతో మృతిచెందిందనే సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి లింగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆదివారం అమరచింతకు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాయకుల నివాళి

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని రాజపేటకు చెందిన లక్ష్మీదేవమ్మ (90) మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఆదివారం గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, మాజీ పట్టణ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, బాబా, మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అన్నారంలో విషాదఛాయలు

పాన్‌గల్: మండలంలోని అన్నారానికి చెందిన సత్యమ్మ, చంద్రయ్యగౌడ్‌ల ఏకైక కుమారుడు మల్లికార్జున్(38) స్నేహితుడి వద్దకు వెళ్తున్న అని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన అతను శనివారం రాత్రి బీచుపల్లి వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రోడ్డు దాటుతుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏకైక కుమారుడు అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మూడోసారి బీజేపీ గెలుపు ఖాయం



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న డీకే భరతసింహారెడ్డి



వీపనగండ్లలో..

వనపర్తి: దేశంలో మూడో సారి బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మెంటపల్లి పురుషోత్తం రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి మండలం చందాపూర్‌లో ఆయన మండల నాయకులతో కలిసి నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ.. కమలం గుర్తుకు ఓటువేయాలని ఓటర్లకు కరపత్రాలను పంచుతూ కోరారు. ఆయనతో పాటు నాయకులు సంద వెంకటేష్, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పిలుపుమేరకు సంగినేనిపల్లి, సంపత్‌రావుపల్లి గ్రామాల్లో బీజేపీ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి నరేంద్రమోడి మూడోసారి ప్రధాన మంత్రి కావడానికి సహకరించాలని కోరారు. రాకేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆవుల నారాయణ, రానా ప్రతాప్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో పల్లెలు అభివృద్ధి

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చందాపూర్‌లో బీజేపీ నాయకులు మెంటపల్లి పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో పల్లెల అభివృద్ధి జరిగిందని వివరించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్ది రాజు, వెంకటేష్ మండల, గ్రామ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఆత్మకూర్: ప్రధానమంత్రి మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని గద్వాల మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లో బీజేపీ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. మోదీ హయాంలో ఎన్నో రకాలుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, కాంగ్రెస్ ఉత్తుత్తి హామీలతో ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆత్మకూర్‌తో పాటు, మండల పరిధిలోని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పుర ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, శ్రీనివాస్, జిల్లా నాయకుడు అనిల్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే.అరుణకు ఓటేసి గెలిపించాలంటూ బీజేపీ నాయకులు మండలంలోని కొంకన్వానిపల్లెలో ఆదివారం ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజుతో పాటు స్థానిక బీజేపీ నాయకులు బీజేపీ కరపత్రాలను ఇంటింటికి పంచిపెడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. మరోమారు బీజేపీ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వలంటూ ప్రచారం చేశారు. పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న డీకే.అరుణ గెలుపును ఎవ్వరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో అనిల్, అంజి, రవి, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.



చందాపూర్‌లో బీజేపీ నాయకుల ప్రచారం



దేవరపల్లిలో..

ప్రత్యేకాధికారులేరి?

పాన్‌గల్: ఇటీవల సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పాలనకు ప్రత్యేకాధికారులను నియమించింది. పంచాయతీ కార్యదర్శులతో, ప్రత్యేకాధికారులను సమన్వయం చేస్తూ గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయం. ఇందుకు అనుగుణంగా మండల స్థాయి అధికారులను పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించి నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 2 నుంచి మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ప్రత్యేకాధికారుల పనితీరుపై పర్యవేక్షణ లోపించడంతో వారు పంచాయతీలకు విధిగా హాజరుకావడంలేదు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సరిగా చేపట్టడం లేదని వాపోతున్నారు.

కార్మికుల ఇబ్బందులు..

పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు అందక వారు పారిశుద్ధ్య పనులు చేసేందుకు ముందుకురావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో సర్పంచ్‌ల పాలనలో వేతనాలు ఆలస్యమైనప్పుడు కార్మికులకు సొంత నిధులు వెచ్చించి వారితో పంచాయతీ సేవలు చేయించుకునేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో కార్మికులతో ఖచ్చితంగా పనిచేయించుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో చెత్త సేకరణ, డంపింగ్ యార్డు నిర్వహణ, వీధి లైట్ల మరమ్మతు, తాగునీటి సరఫరాలో జాప్యం చోటుచేసుకుంది.

తప్పని పనిభారం....

పంచాయతీలకు నియమించబడిన ప్రత్యేకాధికారులు మండల స్థాయి అధికారులు కావడంతో వారు తమ సొంత విభాగంతో పాటు, పంచాయతీలకు హాజరుకావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొందరు అధికారులు వారికి కేటాయించిన గ్రామ పంచాయతీల్లో పర్యటించడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికీ కొందరు వారికి కేటాయించిన గ్రామాల వైపు చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా గ్రామాల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీలు, డ్రెయినేజీలను శుభ్రం చేయించకపోవడం, గ్రామాల్లో వీధి లైట్లు వెలుగకపోవడం, తాగునీటి ఎద్దడి వంటి సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాన్‌గల్‌లో డ్రెయినేజీలో చెత్త ఇలా..